


నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలి
ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు
8లో..

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు చర్యలు
8లో..

ఊపందుకున్న 'అవిశ్వాస' రాజకీయాలు



● సుల్తానాబాద్ మున్సిపల్, అప్పన్నపేట సింగిల్‌విండోలో నెగ్గిన అవిశ్వాసాలు

● 16న మంథనిలో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాస సమావేశం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గత నెలరోజుల నుంచి జిల్లాలోని స్థానిక సంస్థల్లో అవిశ్వాస రాజకీయాలు ఊపందుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్లను గద్దె దింపి తమ పార్టీకి చెందిన వారిని చైర్మన్లుగా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో తమ పార్టీకి బలం లేకున్నా కూడా బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారితోనే అవిశ్వాస తీర్మానాలు ఇప్పించి వారిని పార్టీలో చేర్చుకుంటున్నారు. తమ పార్టీకి చెందిన వారే గాకుండా పార్టీలో చేరే బీఆర్ఎస్‌కు చెందిన వారిని చైర్మన్లుగా ఎన్నుకుంటున్నారు. మండల, జిల్లా పరిషత్ పాలక వర్గాల పదవీకాలం ఈ ఏడాది జూన్ నెలాఖరుతో ముగియనున్నాయి. మున్సిపల్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాల పదవీ కాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి మాసాల్లో ముగియనున్నది.

జిల్లాలో 13 మండల పరిషత్ లు, ఒక జిల్లా పరిషత్ ఉండగా, ఒక మున్సిపల్ కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి. 20 వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. మండల పరిషత్ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, వైస్‌చైర్మన్లను గద్దె దించేందుకు అవిశ్వాస తీర్మానాలను ప్రకటిస్తున్నారు. మండల, జిల్లా పరిషత్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం పెట్టా లంటే నాలుగేళ్ల పదవీ కాలం ముగియాలి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, వైస్‌చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టాలంటే మూడేళ్ల పదవీ కాలం ముగియాలి. మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లపై అవిశ్వాసానికి మూడేళ్ల పదవీ కాలం ముగియాలి.

అయితే గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు పెట్టేందుకు మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు పెంచుతూ బిల్లు రూపొందించి గవర్నర్ ఆమోదానికి పంపించారు. కానీ గవర్నర్ దానిని ఆమోదించలేదు. గత ఏడాది రాష్ట్రంలో పలువురు మున్సిపల్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానా లు పెడితే, గవర్నర్ వద్ద పెండింగులో ఉన్న బిల్లును సాకుగా చూపి కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. ఇప్పటివరకు ఆ బిల్లు ఆమోదం పొందకపోగా, ఆ చైర్మన్ల పదవీ కాలం నాలుగేళ్లు ముగిసిన తర్వాత అవిశ్వాస తీర్మానాలు ఊపందుకున్నాయి.

మరికొందరిపై అవిశ్వాసానికి యత్నాలు

సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతపై గత ఏడాదే అవిశ్వాసం ప్రకటించగా, స్టే తీసుకవచ్చారు. గత నెలలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లతో కలిసి అవిశాస్వం ప్రకటించారు.

ఈనెల 3న ఆర్డీవో అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా 13మంది కౌన్సిలర్లు ఓటు వేయడంతో అవిశ్వాసం నెగ్గింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన గాజుల లక్ష్మి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఈమె చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యేం దుకు కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతు తప్పనిసరిగా కావాల్సి ఉంటుంది. ఎన్నికైన తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతు న్నది. మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైస్‌చైర్మన్ కుమార్‌పై అవిశ్వాసం ప్రకటించారు. ఈనెల 16న మంథని మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఇక్కడ వాస్తవానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఇద్దరు మాత్రమే ఉండగా, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీమేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు ప్రయత్నాలు చేయగా, తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌పై కూడా ఆ పార్టీకి చెందిన బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యుల ద్వారా అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి ఒక జడ్పీటీసీ మాత్రమే ఉండగా, ఒక జడ్పీటీసీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరారు. అవి శ్వాసం పెట్టేందుకు కావాల్సిన ఏడుగురు జడ్పీటీసీ లు సంతకాలు చేసినప్పటికీ, సమావేశం నిర్వ హణకు కోరం ఉండాలి. అంటే 13 మందిలో 9 మంది జడ్పీటీసీలు హాజరుకావాలి, మరొకరి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

పెద్దపల్లి మండలం అప్పన్నపేట సహకార సంఘం చైర్మన్ దాసరి చంద్రారెడ్డిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గగా, చైర్మన్‌గా ఎన్నికైన చింతపండు సంపత్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంథని మున్సిపల్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టాడు. సాంకేతికంగా అవిశ్వాసం పెట్టలేదనే కారణంగా అధికారులు రిజెక్టు చేశారు. తాజాగా ఓదెల మండలం పొత్కపల్లి సంఘం చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డిపై 10 మంది డైరెక్టర్లు అవిశ్వాసం తీర్మానం అందజేశారు. గురువారం ముత్తారం సింగిల్‌విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, వైస్‌చైర్మన్ రమణారెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. పాలకుర్తి మండల పరిషత్ అధ్యక్షురాలు వ్యాళ్ల అనసూర్యపై ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టగా, ఆమె కోర్టును ఆశ్రయించి స్టే తీసుకవచ్చారు. పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, మరికొందరు సింగిల్‌విండో చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యా శాఖ అధికారి మాధవి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో మాధవి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 8 : పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. గురువారం మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు దీర్ఘకాలికంగా గైర్హాజరవుతుండటంతో విద్యార్థుల వద్దకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, కాంప్లెక్స్ సీఆర్‌పీ తిరుపతితో కలిసి జిల్లా విద్యాధికారి మాధవి వారి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పది విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలలకు పంపించాలని, పాఠశాలలో చెప్పే విద్యాబోధనను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సూచించారు. పాఠశాలల్లో పది పరీక్షల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న స్టడీ హవర్స్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల వివరాలను నమోదు చేసుకొని వారి తల్లిదండ్రులకు సూచించారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే చర్యలు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 8: ప్రైవేట్ పాఠశాలలు అనుమతి పత్రంలో తమకు సూచించిన విధంగా నిబంధనలు పాటించకుంటే అనుమతులు రద్దు చేస్తామని జిల్లా విద్యా అధికారి మాధవి అన్నారు. ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో జరిగిన సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. అడ్మిన్ రిజిస్టర్‌లో ప్రతి విద్యార్థిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తమ పాఠశాల డ్రాబాక్స్‌లో ఉన్న ప్రతి విద్యార్థినిని పికప్ చేసే బాధ్యత సంబంధిత పాఠశాలలదేనన్నారు. జిల్లా ప్లానింగ్ అధికారి మల్లేష్‌గౌడ్, పెద్దపల్లి మండల విద్యాధికారి సురేందర్ కుమార్, ప్రధానోపాధ్యాయులు అరుణ కుమారి, కాంప్లెక్స్ సీఆర్పీ బాలసాని వెంకటేశం, రవీందర్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

13న జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 8 : జిల్లాలోని నిరుద్యోగ యువకులకు పెద్దపల్లి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌గా ఉద్యోగాలు కల్పించడానికి ఈనెల 13న ఉదయం 11 గంటలకు పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్న డిగ్రీ లేదా ఎంబీఏ అర్హతగల యువకులు మాత్రమే జాబ్‌మేళాకు హాజరుకావాలని, ఎంపికైన వారు జిల్లా పరిధిలో పని చేయవలసి ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 8985336947, 9502642441 నందు సంప్రదించాలని తెలిపారు.

రామగిరి ఖిల్లాను సందర్శించిన కలెక్టర్

రామగిరి, ఫిబ్రవరి 8: మండలంలోని బేగంపేట్ శివారులో గల రామగిరిఖిల్లాను గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సందర్శించారు. ఖిల్లా అభివృద్ధి పనులను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిసింది. కాగా, స్థానిక యువకులు రామగిరి ఖిల్లా చారిత్రక ఆధారాలతో కూడిన చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

ప్రభుత్వ పరిశ్రమల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

గోదావరిఖని, ఫిబ్రవరి 8: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలంటూ విప్లవ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి అనంతరం పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు కనీస పనికి కనీస వేతనం రూ.26వేలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లలో ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్ముతున్నారని, దేశ ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారద త్తం చేశాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే విశ్వనాథ్, కృష్ణ, శ్రీనివాస్, సీతారామయ్య, అనురాధ, శ్రీధర్, శివబాబు, వరదయ్య, ఎల్ విశ్వనాథం, సాయిలు, రామన్న పాల్గొన్నారు.

ముత్తారం సింగిల్‌విండో చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం



అవిశ్వాసం నోటీసు అందజేస్తున్న డైరెక్టర్లు

ముత్తారం, ఫిబ్రవరి 8 : ముత్తారం సింగిల్ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, వైస్ చైర్మన్ పోతిపెద్ది రమణారెడ్డిలపై గురువారం కలెక్టర్ కార్యాలయంలో అవిశ్వాస నోటీసులు సహకార సంఘం సబ్‌రిజిస్టర్ రామ్మోహన్‌కు 9మంది డైరెక్టర్లు నోటీసులను అందజేశారు. 13డైరెక్టర్‌లకు 9మంది డైరెక్టర్‌లు అవిశ్వాసానికి సంతకాలు చేసి అవిశ్వాస తీర్మానాన్ని డైరెక్టర్‌లు అందజేశారు. డైరెక్టర్లు అల్లడి యాదగిరి రావు, గుజ్జ గోపాలరావు, ఏలువాక కొమురయ్య, కొంకటి మల్లన్న, మద్దెల వెంకటలక్ష్మీ, నాయిని పార్వతమ్మ, సముద్రాల వాణి, ముడుసు ఓదెలు, అల్లం గోవర్ధన్ సబ్‌రిజిస్టర్‌కు నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు పూదరి సర్వేష్, మాజీ జడ్పీటీసీలు చొప్పరి సదానందం, నాగినేని జగన్ మోహన్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, కాంగ్రెస్ నాయకులు గుజ్జ లింగారావు, రామగిరి మహేందర్, వెల్మారెడ్డి సంజీవరెడ్డి, నల్లాల శ్రీను, గాదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో బీఎంఎస్ మహాసభలు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 8: సంఘటిత, అసంఘటిత కార్మిక సమస్యల పరిష్కారానికై ఈనెల 17, 18న గోదావరిఖనిలో అఖిల భారత మజ్దూర్ సంఘ్ 4వ త్రైవార్షిక రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బూర్ల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కంది శ్రీనివాస్ తెలిపారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, వారికి న్యాయమైన డిమాండ్లు యాజమాన్యం అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం హైపవర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని సూచించినప్పటికీ సింగరేణిలో అవి అమలు కావడం లేదని, దేశ వ్యాప్తంగా వేతన సవరణలు, కనీస వేతనాలపై మహాసభలో చర్చించనున్నట్లు చెప్పారు. యాజమాన్యాల మొండి వైఖరిలపై తీసుకోవాల్సిన చర్యలను ఈ మహాసభలో చర్చించనున్నట్లు వారు చెప్పారు. మొదటి రోజు 17న రాష్ట్ర మహాసభలు ప్రారంభమవుతాయని, 18న రాష్ట్ర ఎన్నికలను నిర్వహించనున్నట్లు చెప్పారు. శారదానగర్ శిశుమందిర్‌లో జరిగే మహాసభలకు భారీ పరిశ్రమల శాఖ మంత్రి సురేంద్ర కుమార్ పాండే, మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు రవీందర్‌రాజువర్మ, ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి అతిథులుగా, కాచం రమేష్, సుంకరి మల్లేష్, దురాయ్‌రాజ్, సుజాత పాటిల్ హాజరవుతారని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో బీఎంఎస్ నాయకులు యాదగిరి సత్తయ్య, వంగల విజయ్ మోహన్, భాస్కర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, ఆకుల హరిణ్, బంక రాజేష్ పాల్గొన్నారు.

'సమ్మెను విజయవంతం చేయాలి'

సుల్తానాబాద్, ఫిబ్రవరి 8: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి తాండ్ర అంజయ్య పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ రైస్‌మిల్ ఆపరేటర్స్, గుమస్తాల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మాతంగి రాజమల్లు, బండారి స్వామి, ప్రవీణ్, రవీందర్, సదయ్య, మహేష్, భరత్, కృష్ణ, సది, తిలక్, శ్రీను, ప్రసాద్, గౌతమ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం : డీపీవో



కాట్నపల్లిలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీపీవో



న్యూకొత్తపల్లి గ్రామంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

సుల్తానాబాద్, ఫిబ్రవరి 8: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దూరమవుతాయని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అన్నారు. పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా గురువారం మండంలోని కాట్నపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. పలు శాఖలకు చెందిన అధికారులతో పాటు ప్రత్యేకాధికారులు కారోబార్ వెంకన్న, ఏఎన్ఎం కవిత, అంగన్ వాడీ టీచర్లు కనకలక్ష్మి, స్వప్న, పాల్గొన్నారు.

ధర్మారం,ఫిబ్రవరి8: ప్రతి ఇంటి ఆవరణలో పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో బీ. జయశీల చెప్పారు. గురువారం పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని న్యూకొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో మహిళలకు ఆమె అవగాహన కల్పించారు. గ్రామాల్లో మురికి కాల్వలను శుభ్రపరిచేందుకు ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

'కాన్షీరాంకు భారతరత్న ఇవ్వాలి'

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 8: మాన్యవార్ కాన్షీరాంకు భారతరత్న పురస్కారం అందించాలని మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్చి 4న పెద్దపల్లిలో మాదిగశక్తి భీం జ్యోతి ర్యాలీ నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. ర్యాలీ పోస్టర్లను పంజాబ్ రాష్ట్రం బుంగా సాహిబ్ గ్రామంలో కాన్షీరాం సోదరి స్వరన్‌కౌర్ చేతుల మీదుగా బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వరన్‌కు నూతన వస్త్రాలు అందించి సత్కరించారు. వెంట జిల్లా కన్వీనర్ కల్లెపల్లి రవి, కోకన్వీనర్ ఈదునూరి ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

భూసేకరణపై ఆర్డీవో సమావేశం

రామగిరి, ఫిబ్రవరి 8: జాతీయ రహదారి భూసేకరణపై మండలంలోని బేగంపేట్ గ్రామపంచాయతీలో గురువారం గ్రామస్తులతో మంథని ఆర్డీవో హనుమనాయక్ అవార్డు విచారణ చేపట్టారు. గ్రామంలో కోల్పోయే భూమికి ఆర్‌ఎఫ్‌సీటీ ఎల్‌ఏ ఆర్‌ఆర్-2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తారన్నారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సానుకూలంగా స్పందించి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంచందర్‌రావు, నవాబ్‌పేట్ మాజీ సర్పంచ్ గాజుల ప్రశాంతి, బేగంపేట్ మాజీ సర్పంచ్ బుర్రపద్మ, ఆర్ఐ రాజాబాబు, నిర్వాసితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నరకప్రాయంగా 11ఇంక్లైన్ రోడ్డు

- లారీల నుంచి కింద పడుతున్న బొగ్గు - మూడు నెలలుగా వాటర్ స్ప్రే చేయని అధికారులు





11ఇంక్లైన్‌కు వెళ్లే దారిలో పైకి లేస్తున్న దుమ్ము

గోదావరిఖని, ఫిబ్రవరి 8: సింగరేణి కోల్ కారిడార్ రోడ్లు నరకానికి దారులుగా మారాయి... నిత్యం బొగ్గు రవాణాతో రోడ్డుపై పడుతున్న బొగ్గు పెళ్లలు, దుమ్ముతో రహదారి పూర్తిగా దుమ్ముతో నిండిపోతోంది... దీంతో రాత్రింబవళ్లు బొగ్గు ఉత్పత్తి చేసిన కార్మికులు అదే బొగ్గు టిప్పర్ల కింద నలిగి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. గోదావరిఖని జీడీకే 2ఇంక్లైన్ మోరీ నుంచి జీడీకే 11ఇంక్లైన్ వరకు రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. జీడీకే 5ఇంక్లైన్ ఓసీపీగా విస్తరించడంతో మంథనికి వెళ్లే రహదారి జీడీకే 1ఇంక్లైన్ మీదుగా సుందిళ్ల, ముస్త్యాల, గడ్డంపల్లి మీదుగా సింగిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్డు మీదుగా మళ్లించారు. ఈ రహదారిని గుండానే గోదావరిఖని నుంచి జీడీకే 11ఇంక్లైన్‌కు కార్మికులు విధులకు హాజరవుతున్నారు. నూతనంగా నిర్మించిన రహదారి జీడీకే 2ఇంక్లైన్ మోరీ నుంచి 11ఇంక్లైన్ వరకు సుమారు 22 మూల మలుపులతో నిర్మించడంతో ఈ దారి అత్యంత ప్రమాదకరంగా మారింది. జీడీకే 11ఇంక్లైన్‌లో ఉత్పత్తి అయిన బొగ్గును టిప్పర్ల ద్వారా జీడీకే1 సీఎస్ పీకి తరలిస్తున్నారు. రహదారి ఎక్కువ మూల మలుపులు ఉండడం, టిప్పర్ల డ్రైవర్లు బొగ్గుపై టార్పలిన్ కవర్లు కప్పకపోవడంతో, వేగంగా, నిర్లక్ష్యంగా టిప్పర్లను నడిపిస్తుండడంతో టిప్పర్లలో సీఎస్‌పీకి తరలిస్తున్న బొగ్గుపెళ్లలు నిత్యం రోడ్డు మీద పడి దుమ్ముగా మారుతున్నాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే మిగతా వాహనదా రులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వేకువజామున, రాత్రిపూట జీడీకే 11ఇంక్లైన్ విధులకు హాజరయ్యే కార్మికులు, ఇంటికి వచ్చే కార్మికులపై తీవ్ర ప్రభా వం పడుతుంది. వేకువజామున, రాత్రిపూట ప్రయాణించే కార్మికులు రహదారిపై పెద్ద ఎత్తున దుమ్ము పేరుకుపోయి పైకి లేస్తుండడంతో వాహ నాలు కనిపించక, టిప్పర్ల మితిమీరిన వేగంతో ప్రమాదాలకు గురవుతున్నారు. తాము వెలికితీసిన బొగ్గును రవాణా చేసే టిప్పర్ల కింద పడి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. సింగరేణి యాజమాన్యం ఈ రహదారిపై మూడు గంటలకు ఒకసారి వాటర్‌స్ప్రే చేయాల్సి ఉండగా మూడు నెలలుగా వాటర్ స్ప్రే కూడా జరుగడం లేదు. ఒక్క జనవరి నెలలోనే పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగగా ముగ్గురు కార్మికులు మృత్యువాత పడ్డారు. ఈ విషయంపై రామగుండం ట్రాఫిక్, ఆర్‌టీఏ అధికారులు దృష్టి సారించకపోవడంతో రోజురోజుకు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి.

ఇప్పటికైనా ఈ విషయంపై సింగరేణి అధికారులు, ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, 11ఇంక్లైన్ కార్మికులు కోరుతున్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు, కోళ్లు మృతి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 8: తంగళ్లపల్లి మండల కేంద్రంలో వీధి కుక్కల దాడిలో మేకలు, కోళ్లు మృతి చెందాయి. గురువారం తంగళ్లపల్లికి చెందిన పరకపల్లి తిరుపతికి చెందిన మేకల షెడ్‌పై వీధి కుక్కలు దాడి చేశాయి. ఆరు గొర్రెలు, 20 కోళ్లు మృతి చెందాయి. బాధిత తిరుపతి కుటుంబాన్ని ఎంపీపీ పడి గెల మానస రాజు, ఎంపీటీసీ కోడి అంతయ్య పరామర్శించారు. బాధితుడికి ఎంపీటీసీ అంతయ్య రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి విషయాన్ని తీసు కెళ్లి బాధిత కుటుంబానికి సాయం అందేలా చూస్తామన్నారు.



మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రమాదవశాత్తూ బావిలో పడిన యువకుడు

- మృతదేహం కోసం గాలింపు

శంకరపట్నం, ఫిబ్రవరి 8:మండలంలోని కరీంపేటలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. ప్రత్యేక సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్‌గౌస్ (30) అనే యువకుడు గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఊరికి సమీపంలో గల ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో జారిపడే సమయంలో సమీపంలో ఉన్న ఓ రైతు ప్రత్యక్షంగా చూసినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. నీరు ఎక్కువగా ఉండడంతో అచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపు నిలిపివేశారు.

దొంగ అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8 : ఇటీవల నగరంలోని పలు చోట్ల ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌కు చెందిన రౌతు పవన్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పవన్ వద్ద ట్యాబ్, 2 సెల్‌ఫోన్లు, 9 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



వాసవీమాత ఆలయంలో పూజలు

మల్లాపూర్, ఫిబ్రవరి, 8 : మల్లాపూర్ వాసవి మాత ఆలయంలో అమ్మ వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వాహకులు గురువారం ఘనంగా జరిపారు. ఉదయం నుంచి ఆర్యవైశ్యులు, భక్తులు ఆలయంలోని అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా హల్దిపు పీఠాధిపతి శ్రీవామానాశ్రమ మహాస్వామిజీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండ లాధ్యక్షుడు చౌడారపు శ్రీనివాస్, మైలారపు లింబాద్రి, శివ రాంకిషన్, శివ శ్రీనివాస్, గాదె మనోహర్, సంగేమ్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 8: సంత్ సేవాలాల్ మహాజన్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీల ఐక్య వేదిక(లైవ్) అధ్యక్షుడు భూక్య నరేష్‌నాయక్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా దాదాపు మూడు కోట్లు, రాష్ట్రంలో దాదాపు 35లక్ష మంది గిరిజనులు(లంబాడీలు)ఉన్నారన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చే వారిలో ఎక్కువ శాతం గిరిజనులు ఉంటారని, వారికి ఇబ్బందులు కలగకుండా సదు పాయాలు కల్పించాలని, పాలక వర్గంలో గిరిజనులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మోహన్ నాయక్, రమేష్‌నాయక్, రాజేష్‌నాయక్, గంగాధర్‌నాయక్, నవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 8: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 10న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో మహిళలు, పురుషుల విభాగంలో ఈ పోటీలను సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించనున్నామని జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి సిహెచ్ సంపత్‌రావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 25 కిలోల లోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే క్రీడాకారు లను మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు.

ఇల్లందకుంట ఆలయంలో వేలం పాటలు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 8: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో కొబ్బరి కాయలు అమ్ముకొనుటకు, పోగు చేసుకొనుటకు దేవాదాయ శాఖ డివిజన్ పరిశీ లకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం బహిరంగ వేలం నిర్వహిం చారు. ఈ మేరకు పూజా సామగ్రి, కొబ్బరికాయలు ఒక సంవత్సరం పాటు అమ్ముకొనుటకు ఎనగంటి వెంకటేశ్వర్లు రూ.7,66,000 పాట, అదేవిధంగా కొబ్బరి ముక్కలు పోగు చేసుకొనుటకు క్యాతం రాజయ్య రూ.1,60,000 పాట పాడి టెండర్ దక్కించుకున్నారు. ఈ టెండర్ వీరికి ఒక సంవత్సరం ఉంటుందని ఆలయ ఈవో కందుల సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో మోహన్, రాజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో కానిస్టేబుల్ రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 8: భార్య స్రవంతి ఆత్మహత్య కేసులో సిరిసిల్ల పట్టణం సర్ధాపూర్ 17వ బెటాలియన్ కానిస్టేబుల్, భర్త రాగుల నాగరాజు అనే కానిస్టేబుల్‌ను అరెస్ట్‌చేసి గురువారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన నాగరాజు, స్రవంతి అలియాస్ లాస్య దంపతులు సిరిసిల్లలో ఉంటున్నారు. భార్య స్రవంతి మృతికి భర్త నాగరాజు, అత్తలే కారణమంటూ ఆమె తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మృతురాలి అత్తను అరెస్ట్ చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చిగురుమామిడి,ఫిబ్రవరి 8: మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన కక్కర్ల లక్ష్మణ్(40) అనే గీత కార్మికుడు గురువారం ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మణ్‌ను తోటి గీత కార్మికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు గౌడ సంఘం నాయకులు తాళ్లపెల్లి రాజయ్య తెలిపారు. పేద కుటుంబానికి చెందిన గీత కార్మికుడికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.6,650 పలికిన పత్తి ధర

● జమ్మికుంట మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 8: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,650 పలికింది. గురువారం వ్యవసాయ మార్కెట్‌కు 88మంది రైతులు 770క్వింటాళ్ల విడి పత్తి, 10మంది రైతులు 19క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6,650, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆదివారాలు యార్డుకు సెలవు దినాలు, తిరిగి సోమవారం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని కందుగుల గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ గురువారం తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా గ్రామ శివారులోని రైస్ మిల్‌లో సుమారు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన అప్పని రమేష్, వెలగందుల ప్రకాష్, ఉప్పల్ గ్రామానికి చెందిన పోతిరెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తులు సదరు మిల్ యాజమానికి ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8: జన్మదిన వేడుకల సందర్భంగా రోడ్డుపై న్యూసెన్స్ చేస్తుండగా వారించిన వ్యక్తిపై బీరుసీసాతో దాడి చేసిన కేసులో ఆరుగురు యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కార్ఖానగడ్డ గాంధీరోడ్ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి 2:30 గంటలకు బర్త్‌డే వేడుకల సందర్భంగా యువకులు రోడ్డుపైకి వచ్చి న్యూసెన్స్ చేశారని, వీంతో స్థానికుడు గంభీరావుపేట్ పృథ్వీరాజ్ వారించగా వెంటనే యువకులు దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ కేసులో కార్ఖనగడ్డకు చెందిన దసనం సాయి భరద్వాజ్, బొబ్బటి భరత్‌కుమార్, పెపకాయల సాయి మురళి, జగిత్యాల దోబివాడకు చెందిన బండ వరుణ్, మండ వర్ధన్, గాంధీనగర్‌కు చెందిన బొల్లారపు అభి అలియాస్ భరత్‌లను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ప్రయాణికురాలి బ్యాగు అప్పగింత

భగత్‌నగర్, ఫిబ్రవరి 8: బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగును ఆర్‌టీసీ అధికారులు ఆమెకు అప్పగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొదురుపాకకు చెందిన ప్రయాణికురాలు భార్గవి ఈ నెల 7న ఆర్‌టీసీ బస్సులో బ్యాగు మర్చిపోయింది. డ్యూటీలో ఉన్న కండక్టర్ జె గంగాధర్, కానిస్టేబుల్ ఎండి అఫ్రోజోద్దిన్ ఆ బ్యాగును గుర్తించి అధికారులకు అప్పగించారు. తన బ్యాగు పోయిన విషయాన్ని ఆమె అధికారుల దృష్టికి తీసుకురాగా పూర్తి వివరాలను తెలుసుకొని ఆమె బ్యాగును ఆమెకు అందచేశారు. బ్యాగులో రూ.35000లు రెండు వేల రూపాయల విలువైన బట్టలు అందులో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎర్నింగ్ డీసీ ఇబి రావు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరాజం, కంట్రోలర్ కె రవిందర్, కంటక్టర్ జె గంగాధర్ పాల్గొన్నారు.

ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: కులం పేరుతో దూషించడంతో పాటు చంపుతామని బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సందుపట్ల రాంరెడ్డి, సందుపట్ల రాజిరెడ్డి, సందుపట్ల సత్తవ్వ, సందుపట్ల లక్ష్మారెడ్డి, సందుపట్ల పద్మారెడ్డి, మోగి ఆగయ్యలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. మండలంలోని గొల్లపల్లికి చెందిన దాసరి కృష్ణంరాజు మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో గత 8 ఏళ్లుగా టీకొట్టు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని పేర్కొన్నారు. తన టీకొట్టు చుట్టూ రేకులు అమర్చుకోవడం కోసం బండరాళ్లను పేర్చుతుండగా ఇది మా స్థలం అంటూ నిందితులు బెదిరించారని తెలిపారు. అతనిపై దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించాలని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

కత్తులతో విద్యార్థినులను బెదిరించిన యువకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 8: ముస్తాబాద్ మండల కేంద్రంలో విద్యార్థినులను యువకులు కత్తులతో బెదిరించిన సంఘటన గురువారం కలకలం రేపింది. విద్యార్థినుల తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులు భోజన సమయంలో ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో ముగ్గురు యువకులు బైక్ వచ్చి కత్తులతో బెదిరించారు. విద్యార్థినుల అరుపులు విని సమీపంలో ఉన్న కాలనీవాసులు బయటకు వచ్చారు. ఈలోగా బైక్‌పై ఉన్న యువకులు పారిపోయారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. సీసీ కెమెరాల సాయంతో యువకులను పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

బీహార్ కూలీపై దాడి


కార్మికుడి ఒంటిపై గాయాలు

రామగిరి, ఫిబ్రవరి 8: మండలంలోని లొంకకేసారం సాయిబ్రిక్స్ (ఎస్‌ఏఐ) యాజమాని సోదరుడు ఒరిస్సా కూలీపై దాడి చేశాడు. ఇటుక బట్టీలో పనిచేసే బీహార్‌కు చెందిన చర్యా అనే కూలీపై సైండ్ల విష్ణు అనే యువకుడు గురువారం విచక్షణ రహితంగా కర్ర, చెప్పులతో దాడికి పాల్పడినట్లు కూలీ చర్యా పేర్కొన్నాడు. అర్ధరాత్రి వేళ కాలుతున్న బటీనుంచి ఇటుకలు లోడ్ చేయాలంటూ బెదిరింపులకు గురిచేశాడని తెలిపాడు. తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను తీసుకొని ఇష్టవచ్చినట్లు దూషించాడని కూలీ ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవిప్రసాద్ తెలిపారు.

ఆవాల పరిశోధనాస్థానం ఏర్పాటయ్యేనా?

● మూడేళ్లుగా కాగితాలకే పరిమితం ● శాస్త్రవేత్తలు, నిధులు లేక అన్నదాతల్లో నిరుత్సాహం


జగిత్యాల పొలాస ప్రాంతీయ పరిశోధన స్థానం


జగిత్యాల జిల్లాలో సాగవుతున్న ఆవాల పంట

జగిత్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక పరిశోధనా స్థానం ఏర్పాటు కోసం ఆశపడుతున్న ఆవాల రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మూడు సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా పొలాసలో ఆవాల పరిశోధనా స్థానం ఏర్పాటు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైంది. ఒక వైపు శాస్త్రవేత్తలు లేక..మరో వైపు నిధులు రాక ఆవాల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉత్తర తెలంగాణలో వ్యవసాయ పరిశోధనలకు కేంద్రమైన జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తామని చెప్పి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ అతీ, గతీ లేకుండా పోయింది. ఆవాల పరిశోధన స్థానం మంజూరులో జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా వ్యవహరించిన నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఇప్పటికీ మంజూరు కాలేదు. నిధులు కానీ, శాస్త్రవేత్తలను కానీ నియమించలేదు. దీంతో ఆవాల పరిశోధనా స్థానం అటకెక్కినట్లేనని రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఆవ సాగు ఉత్తర తెలంగాణలోనే అధికం

ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల్లో ఆవాల పంట సాగుచేస్తున్నారు. ఇక్కడి పొడి వాతావరణ పరిస్థితులు ఆవాల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. దీనికి తోడు సాగుకు అవసరమైన ఎర్ర నేలలు ఉండడం కూడా ఆవాల సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమవుతోంది. సాగునీటి వసతి ఉండడం, నాలుగైదు నీటి తడులు ఇస్తే సరిపోవడం, 80-90 రోజుల్లోనే పంట చేతికి వస్తుండడంతో రైతులు ఈ పంట సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ప్రాంతాల్లో ప్రైవేటు కంపెనీలు ఆవాల సాగును విస్తృతంగా చేపడుతున్నాయి. పలు కంపెనీలు విత్తనోత్పత్తిని చేపట్టి, ఇతర రాష్ట్రాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాయి. రైతులు విత్తనోత్పత్తిలో సాగు చేస్తే క్వింటాలుకు రూ. 9 వేల వరకు ధర అందిస్తున్నారు. సాధారణ ఆవాలకు క్వింటాలుకు రూ.7-8 వేల వరకు ధర చెల్లిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఆవాల పంటకు అడవి పందులు, పక్షులు, కోతుల బెడద లేకపోవడం, పంట ముందుగానే ఏ రేటు వస్తుందో రైతులకు తెలియడంతో ఎక్కువగా సాగుకు ముందుకు వస్తున్నారు. మంచి పంటవస్తే ఎకరాకు 6-8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ఎకరాకు రూ.50వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వరి, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా ఆవాల పంటను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ ఫలితం కనబడటం లేదు.

నివేదికలకే పరిమితం

నాలుగేళ్ల క్రితం ఉత్తర తెలంగాణ (పొలాస) పరిశోధన స్థానం పరిధిలో ఆవాల పంట సాగుచేసి, ఇక్కడి శాస్త్రవేత్తలు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి నివేదికలు పంపారు. ఆవాల పరిశోధనా స్థానం ఏర్పాటు కోసం జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి సైతం సంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వానికి సానుకూల నివేదికను పంపింది. కరోనా సమయంలో సంబంధిత ప్రతిపాదనలు ముందుకు కదలలేదు. అనంతరం జరిగిన జాతీయ పరిశోధన మండలి సమావేశంలో పాల్గొన్న అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలంగాణలోని పొలాసలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని సూచించినా ఇప్పటివరకు ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు.

గతంలోనే నివేదికలు పంపాము

- డాక్టర్ శ్రీనివాస్, ఏడీ, వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస



జగిత్యాల జిల్లా పొలాసలో వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అదనంగా ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని గతంలోనే రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా జాతీయ వ్యవసాయ పరిశోధన మండలికి నివేదికను పంపాం. మండలి సైతం ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటుకు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తే ఉత్తర తెలంగాణ ఆవాల రైతులకు మేలు జరుగనుంది.

కొండగట్టు హుండీ ఆదాయం రూ.83.91 లక్షలు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, ఫిబ్రవరి 8: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని అధికారులు గురువారం లెక్కింపు చేపట్టారు. 28 రోజులకు హుండీల ద్వారా రూ.83,91,502 నగదు దేవస్థానానికి సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 32 గ్రాముల మిశ్రమ బంగారం, 4.500కిలోల మిశ్రమ వెండి, 13 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో పి.వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయశాఖ ఏసీ చంద్రశేఖర్, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఎస్సై అశోక్, ఏఎస్సైలు చిలుక శ్రీనివాస్, రమణారెడ్డి పాల్గొన్నారు. క్రితం సారి హుండీ లెక్కింపు సందర్భంగా సిబ్బంది సొమ్ములు తస్కరించిన నేపథ్యంలో మరోసారి అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ బందోబస్తు పెంచారు.

విద్యుత్ స్టార్టర్ల దహనం


ధర్మారంలో దహనమైన విద్యుత్ స్టార్టర్

కోనరావుపేట, ఫిబ్రవరి 8 : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బావి మోటారు స్టార్టర్లను దహనం చేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన గంగుల మహేష్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి రెండు మోటారు స్టార్టర్లను దహనం చేశారు. దీంతో ఆ రైతుకు పది వేల రూపాయల వరకు నష్టం వాటిలినట్లు బాధిత రైతు తెలిపాడు.

వ్యక్తి దారుణ హత్య

● పాత కక్షలతోనే అని అనుమానాలు


వెంకటరమణ(ఫైల్)

కోరుట్ల, ఫిబ్రవరి 8: పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం సాయంత్రం ఓ వ్యక్తి హత్య ఘటన సంచలనం రేపింది. ద్విచక్రవాహనంపై వెలుతున్న వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో విచక్షణా రహితంగా దాడికి పాల్పడడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అయితే పాత కక్షలే హత్యకు కారణమని తెలుస్తోంది. కాలనీ వాసులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల పట్టణంలోని గాంధీ రోడ్డుకు చెందిన అనుమాల్ల వెంకటరమణ (55) పట్టణంలో వడ్డీ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. వెంకటరమణ పట్టణంలోని అర్బన్ కాలనీలో ఓ ఇంటిని గెస్టు హౌస్‌గా ఏర్పరుచుకుని అక్కడి నుంచి వడ్డీ వ్యాపారంతో పాటు ప్రైవేట్ చిట్టీలను నడిపిస్తుండేవాడు. అదే కాలనీకి చెందిన వాసాల రఘుకు వెంకటరమణ మధ్య ఓ విషయంలో మనస్పర్ధలు రావడటంతో గతంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగి రాజీపడ్డారు. రఘు కొన్ని రోజులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఇటీవల తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి రఘు తన కాలనీ ప్రాంతంలోనే గణేష్ విగ్రహాల తయారీ కేంద్రంలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల వెంకటరమణ రఘు మధ్య మరో మారు గొడవలు తలెత్తాయి. ఈ క్రమంలో గురువారం సాయంత్రం యధావిధిగా వెంకటరమణ తన ద్విచక్ర వాహనంపై తన గెస్ట్ హౌస్‌కు వెలుతుండగా మాటు వేసిన రఘు వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో వెంకటరమణ పక్కనే ఉన్న మురికి కాలువలో పడిపోయాడు. అప్పటికీ ఆగకుండా రఘు తన వద్ద ఉన్న కత్తితో మళ్లీ దాడి చేయడంతో వెంకటరమణ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అక్కడి నుంచి నిందితుడు పరారయ్యాడు. గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించడంతో మెట్‌పల్లి డీఎస్పీ రవీంధర్ రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐ కిరణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వివరాలు సేకరించి నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు రాత్రి సమయంలో పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

నష్టపరిహారం ఇచ్చి భవనాలను నిర్మించాలి

● మెడికల్ కళాశాల నిర్మాణ పనులు అడ్డుకున్నరైతులు


పనులు అడ్డుకున్న రైతులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8 : మా భూములకు నష్టపరిహారం ఇచ్చిన తర్వాత మెడికల్ కళాశాల అదనపు భవనాలను నిర్మించుకోవాలంటూ గురువారం నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని సర్వేనంబర్ 408లో ఉన్న భూములను గత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు తీసుకుని భవనం నిర్మించారు. మిగిలిన భూముల్లో తిరిగి అదనపు భవనాలను నిర్మించేందుకు బుధవారం వచ్చిన అధికారులు, కాంట్రాక్టర్‌లను రైతులు అడ్డుకోవడంతో పనులు నిలిపివేసి వెళ్లిపోయారు. గురువారం కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్యశాఖ ఈఈ రవీందర్‌లు పెద్దూర్‌కు చెరుకుని ఎక్స్‌కావేటర్‌లతో భూములుల్లో పనులను చేపట్టగా ఈ విషయం తెలుసుకున్న 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రి బాలరాజుయాదవ్‌తోపాటు రైతులు అక్కడికి చేరుకుని పనులు అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఆందోళన చేయడంతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించినా రైతులు మాత్రం మా భూములకు నష్టపరిహారం అందించిన తరువాతనే భవనాలను నిర్మించాలని పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం 408సర్వేనంబర్‌లో ఉన్న భూములను జీవనోపాధికోసం అందించగా వాటిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండగా గత రెండు సంవత్సరాల క్రితం మా భూములను చదును చేసి 36 ఎకరాలల్లో మెడికల్ కళాశాల నిర్మాణాలను చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోలేదన్నారు. దీంతో మిగతా భూములను ఇవ్వవద్దని నిర్ణయించుకున్నామని తీసుకున్న భూములతో పాటు భూములకు నష్టపరిహారం అందిస్తేనే పనులు చేయిస్తామని లేకుంటే అడ్డుకుని ఆందోళనలు చేయడంతో పాటు నిరాహార దీక్ష చేపడుతామన్నారు. నష్టపరిహారం ఇచ్చిన తరువాతనే పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు లింగంపల్లి అశోక్, నాగుల రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, గుగ్గిళ్ల అంజవ్వ, లింగంపల్లి రాజవ్వ, లింగంపల్లి దేవరాజు, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎల్లంపల్లి గేట్‌వాల్వులు ధ్వంసం.. వృథాగా సాగునీరు


గోపాల్‌రావు పేట వద్ద వృథాగా పోతున్న నీరు

రామడుగు, ఫిబ్రవరి 8: అధికారుల అనుమతి లేకున్నా కొంతమంది ఎల్లంపల్లి పైపులైన్ గేట్ వాల్వులను ధ్వంసం చేయగా వృథాగా పంట పొలాల్లోకి నీరు రావడంతో పంటపొలాలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట, గుండి గ్రామాల మీదుగా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి బెల్లంపల్లి పైప్‌లైన్ ద్వారా నీరు వెళ్తుంది. అయితే వారం క్రితం ఎల్లంపల్లి నుంచి గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు సంబంధిత అధికారులు నీటిని విడుదల చేశారు. కాగా ఎల్లంపల్లి పైప్‌లైన్‌కు గోపాల్‌రావుపేట, గుండి గ్రామాలలో సుమారు రెండు మూడు కిలోమీటర్లకు మూడు నుంచి నాలుగు గేట్ వాల్‌లను అమర్చారు. ఇదే అదునుగా చేసుకున్న కొంతమంది గోపాల్‌రావుపేటకు సమీపంలోని ఎల్లంపల్లి పైప్‌లైన్ మీద ఉన్న రెండు గేట్‌వాల్ ధ్వంసం చేయడంతో నీరంతా పైకి లేచింది. దీంతో దేశాయిపేట చెరువులోకి నీరు వెళ్లేందుకు ఏకంగా జేసీబీతో పైప్‌లైన్‌పై కాలువ తీసి గోపాల్‌రావుపేట రైతుల అనుమతి లేకుండా అక్రమంగా కాలువను తీశారని రైతులు వాపోతున్నారు. గేట్‌వాల్‌ల నుంచి వచ్చే నీరంతా రైతుల పంటపొలాల్లోకి వెళ్లడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఎడవల్లి రామచంద్రారెడ్డి అనే రైతు పొలంలో తన అనుమతి లేకుండానే జేసీబీతో కాలువను తవ్వి నీటిని చెరువులోకి తరలిస్తున్నారని అన్నారు. గేట్‌వాల్‌ను ధ్వంసం చేసి అక్రమంగా నీటిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేములవాడలో ఘనంగా మహాలింగార్చన


మహా లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, ఫిబ్రవరి 8 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి గురువారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఉదయం వేళలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం వేళలో స్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాకారంలో అమర్చిన ప్రమిదలలో జ్యోతులు వెలిగించి పూజించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక ఫిబ్రవరి8: మండలంలోని గంగారం గ్రామంలో పోలిసులు పెట్రోలింగ్ చేస్తుండగా 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం అక్రమంగా టాటా ఏఎస్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. గ్రామాల్లో ప్రజల నుంచి నేరుగా విక్రహించి మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. గంగారం గ్రామంలో నరహరి శంకర్‌రెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 17 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకొని సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్‌కు అప్పగించినట్టు తెలిపారు.

ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించినా నిల్వ ఉంచినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

సభలో ఉమ్మడి జిల్లా నేతలు



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సీఎంకు స్వాగతం పలుకుతున్న శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్‌బాబు, విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




సమావేశాలకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, రమణ, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్, విజయరమణారావు

ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 8 : పెద్దపల్లి పట్టణంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) వారి సహకారంతో జావా ఫండమెంటల్స్ సర్టిఫికేషన్ ప్రోగ్రాంపై మూడు రోజుల వర్క్‌షాప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టాస్క్ రిసోర్స్ పర్సన్ ప్రణయ్, టెక్నికల్ ట్రైనర్ విద్యార్థులకు జావా ఫండమెంటల్స్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం అనే అంశాలపై వివరించారు. విద్యార్థులకు నైపుణ్యత పరీక్ష నిర్వహిం సర్టిఫికెట్స్ అందజేశారు. డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ మణిగణేష్, ఏవో సురేష్, రాజిరెడ్డి మరియు టాస్క్ కోఆర్డినేటర్స్ డాక్టర్ కౌసల్య, కృష్ణయ్య, స్వాతి, మధుశేఖర్ విభాగ అధిపతులు డాక్టర్ నటరాజన్, ప్రభాకర్, సీనియర్ ఆధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత...

కమాన్‌పూర్, ఫిబ్రవరి 8 : మండల కేంద్రానికి చెందిన పల్లె రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి గురువారం 1992-93వ బ్యాచ్ పదో తరగతి మిత్రులు ఆర్థిక సహాయం అందజేసి ఔదార్యం చాటుకున్నారు. మృతుడి భార్య పల్లె మంగకు రూ. 70 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శ్రీదేవి, కోలేటి శేఖర్, కొంతం సత్యనారాయణ, తాటిపల్లి శ్రీనివాస్, చక్రి, కడారి రమేష్, ఆయిల్ వెంకటేష్, దాసరి రామచందర్, దాసరి చందర్, దాసరిపల్లి అంజమ్మ, మల్యాల వినోద, కొప్పుల భాగ్య ఉన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కమాన్‌పూర్, ఫిబ్రవరి 8 : కరీంనగర్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన అబాకస్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన ఆపిల్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ చదువు వెంకట్‌రెడ్డి గురువారం తెలిపారు. పాఠశాలలో చదువుతున్న గజ్వే లక్ష్మీకృష్ణ, కేశెట్టి అరవింద్‌లు ప్రతిభను కనబర్చి బహుమతులు అందుకున్నారు. ప్రిన్సిపాల్ రాజమణి, ఉపాధ్యాయులు భూలక్ష్మీ, శారద, రాసవి, గౌతమి, రుతివ్యలు విద్యార్థులను అభినందించారు.

మంత్రి పొన్నంను కలిసిన గౌడ సంఘం నాయకులు

అంతర్గాం, ఫిబ్రవరి 8: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు ముంజా బుగ్గరాములుగౌడ్ హైదరాబాద్‌లో కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో గౌడ కులస్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను బుగ్గ రాములుగౌడ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'పోలీసుల పహారాలో కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యం'

రామగిరి, ఫిబ్రవరి 8: బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన నిధులతో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఏర్పాటు చేసిన శిలాఫలాకలను పోలీసుల పహారాలో కాంగ్రెస్ నాయకులు కూల్చి దౌర్జన్యం చేశారని నాగేపల్లి తాజా మాజీ సర్పంచ్ కొండవేన ఓదేలు ఆరోపించారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రోటోకాల్ ఉల్లంఘించారంటూ మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్‌కు స్థానిక తప్పుడు ఫిర్యాదు చేసి శిలాఫలకాలను తొలగింపు చేపట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శంకేషీరవీందర్, గద్దలశంకర్, అనిల్, వేగొలపు శ్రీనివాస్, కొండవేన ప్రభాకర్, సుధాకర్, మల్యాల సారయ్య, ప్రశాంత్, అనీల్ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన సర్పంచ్‌లకు సన్మానం

ముత్తారం, ఫిబ్రవరి 8 : మండలంలోని పదవీ విరమణ పొందిన సర్పంచ్‌లను గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య, జడ్పీటీసీ చెలకల స్వర్ణలత-అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో అధికారులతో కలిసి సన్మానించారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కేశనపల్లి సర్పంచ్ నూనె కుమార్, తహసీల్దార్ బీ రాజేశ్వరి, నాయబ్ తహసీల్దార్ ఉదయ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వేణుమాధవ్, ఏవో శ్రీకాంత్, ఏపీఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 8 : జిల్లా కేంద్రంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో గురువారం స్టూడెంట్ ఫర్ సేవ జిల్లా కన్వీనర్ సందనవేని ఓమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి వారి బ్లడ్ గ్రూప్‌లను తెలియజేశారు. రాసూరి ప్రవీన్, బండి రాజశేఖర్, సాయితేజ, అజయ్, అరవిందర్, రాకేష్, విష్ణు, రెడ్‌క్రాస్ సొసైటి సభ్యులు రాజగోపాల్, మూర్తి పాల్గొన్నారు.

మేడారం జాతరకు ఆర్టీసీ ఏర్పాట్లు..

- జిల్లాలోని 4 పాయింట్ల నుంచి 521 బస్సులు - బస్టాండ్లలో ఏర్పాట్లకు శ్రీకారం చుట్టిన అధికారులు



మంథని డిపో బస్సులు



మంథని బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాట్లు చేపడుతున్న అధికారులు

మంథని, ఫిబ్రవరి 8: రెండేళ్లకోసారి జరిగే మేడారం శ్రీసమ్మక్క-సారలమ్మల జాతరకు ప్రయాణికులను తరలించడానికి ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. వన దేవతల జాతరకు భారీఎత్తున భక్తజనం తరలివెళ్లే నేపథ్యంలో ఆర్టీసీ అధిక సంఖ్యలో బస్సులను సిద్ధం చేస్తోంది. ఈనెల 21, 22, 23, 24 తేదీల్లో మేడారంలో జరిగే వన దేవతల జనజాతరకు జిల్లాలోని మంథని, గోదావరిఖని, పెద్దపల్లి, 8వ కాలనీ పాయింట్ల నుంచి 521 బస్సుల్లో జాతరకు ప్రజలను తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18 నుంచి 25 తేదీ వరకు ఆర్టీసీ బస్సు సంస్థ భక్తులను తరలించడానికి తమ సరీస్సులను జాతర కోసం తిప్పనున్నారు. త్వరలో ట్రయల్ సర్వీలను సైతం రన్ చేయటానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని మంథని, పెద్దపల్లి, గోదావరిఖని బస్టాండ్ల అవరణలో జాతర బస్సుల పాయింట్లు, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడానికి ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రయాణికులకు క్యూలైన్లు, బస్సుల ఎలైటింగ్ పాయింట్, నీడ, తాగునీరు, కరెంట్, లైటింగ్, మైక్ అనౌన్స్‌మెంట్, వైద్య శిబిరం, సెక్యూరిటీ లాంటి పలు అంశాలపై దృష్టి సారించి తగిన విధంగా ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. వివిధ డిపోల నుంచి వచ్చే డ్రైవర్లు, కండక్టర్లకు భోజన, విశ్రాంతి కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో మేడారం జాతరకు వెళ్లేందుకు మంథని బస్టాండ్ వచ్చే భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను కరీంనగర్ ఆర్ఎం సుచరిత బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు.

● ఆర్టీసీ ప్రచారం..

జాతరకు వెళ్లే భక్తులకు తమ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని ఆర్టీసీ సంస్థ ప్రచారం చేసుకుంటోంది. భారీ భక్త జనం తరలివచ్చే మేడారం జాతరలో ఎలాంటి ట్రాఫిక్ జామ్ లేకుండా జాతరకు చేరుకోవచ్చని, మేడారంలో అమ్మవార్ల గద్దెల సమీపంలోనే బస్టాండ్ ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా గుడి వద్దకు వెళ్లే అవకాశం ఉంటుందని చెబుతోంది. అలాగే అమ్మవార్ల దర్శనం అనంతరం తిరిగి సమీపంలో ఉండే బస్టాండ్‌కు చేరుకుని తిరుగు ప్రయాణం కావడం సులభంగా ఉంటుందని, చార్జీలు సైతం రీజనెబుల్‌గా ఉంటాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

● మహిళలకు ఫ్రీ..

ప్రభుత్వం తీసుకున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ నిర్ణయాన్ని మేడారం జాతరకు సైతం వర్తింపజేసింది. దీంతో మేడారం జాతరకు మహిళా భకులు ఉచితంగా వెళ్లి రావొచ్చు. పురుషులు, మగపిల్లలకు మాత్రమే జాతరకు వెళ్లే బస్సుల్లో సదరు పాయింట్ నుంచి టికెట్ చార్జీలు వసూలు చేయనున్నారు. దీంతో ఈసారి మేడారం అమ్మవార్ల జాతరకు అధిక సంఖ్యలో మహిళ భక్తులు తరలివెళ్లే అవకాశం ఉంది.

జిల్లా నుంచి వెళ్లే బస్సుల సంఖ్య, చార్జీల వివరాలు..

పాయింట్	బస్సుల సంఖ్య	దూరం	చార్జీ	
			పెద్దలకు	పిల్లలకు
1. మంథని	178	150కి.మీ.	రూ.320	రూ.180
2. పెద్దపల్లి	203	185	రూ.380	రూ.210
3. గోదావరిఖని	120	175	రూ.370	రూ.200
4. 8వ కాలనీ	20	175	రూ.370	రూ.200
● కాటారం, కాళేశ్వరం, సిర్వోంచ నుంచి సైతం..				
1. కాళేశ్వరం	15	155	రూ.350	రూ.180
2. కాటారం	10	120	రూ.260	రూ.150
3. సిర్వోంచ(మహారాష్ట్ర)	30	175	రూ.370	రూ.200
4. భూపాలపల్లి	100	100	రూ.220	రూ.130

సమ్మక్క జాతర ఏర్పాట్ల పరిశీలన

ఓదెల, ఫిబ్రవరి 8 : మండలంలోని కొలనూర్ గుట్టల్లో ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను సుల్తానాబాద్ సీఐ జగదీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, బందోబస్త్, వంటి వివరాలను ఆలయ కమిటీని అడిగి తెలుసుకున్నారు. జాతర నిర్వహణ సజావుగా జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ కోరారు. వారి వెంట పొత్కపల్లి ఎస్ఐ శ్రీధర్, మాజీ సర్పంచ్ సామ శంకర్, బిజేపి నాయకులు కర్రె సంజీవరెడ్డి జాతర కమిటి సభ్యులు సామ రాజేందర్‌తో పాటు పలువురు ఉన్నారు.

అంతర్గాం, ఫిబ్రవరి 8: మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరి తీరప్రాంతలో ఈనెల 21 నుంచి 24 వరకు జరుగనున్న సమ్మక్క - సారలమ్మ జాతర ప్రదేశాన్ని గురువారం అంతర్గాం తహసీల్దార్ పీ రాంమోహన్‌రావు సందర్శించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లను చేయాలని కోరారు. ఎంపీడీవో యాదగిరి, ఎస్ఐ సంతోష్‌కుమార్, డీఈ నాయుడు, ఏఈ మురళి, జాతర కమిటీ ప్రతినిధులు పెండ్రు హన్మాన్ రెడ్డి, కోల రాంమూర్తిగౌడ్, పానగంటి సత్తయ్య పాల్గొన్నారు.

సమ్మక్క జాతర రహదారి పనులు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 8: మండలంలోని పెగడపల్లిలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర రహదారి పనులను మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి రమేష్, సుముఖం మల్లారెడ్డి, నక్కల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

'పెద్దపల్లి పార్లమెంట్ టికెట్ మాదిగలకే కేటాయించాలి'

మంథని, ఫిబ్రవరి 8: పెద్దపల్లి ఎంపీ టికెట్ మాదిగ సామాజిక వర్గానికే కేటాయించాలని ప్రధాన రాజకీయ పార్టీలను ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య డిమాండ్ చేశారు. గురువారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో సుమారు 2 లక్షల 50 వేల పైచిలుకు మాదిగ ఓటర్లు ఉన్నప్పటికీ ఇతరులకు టికెట్లు కేటాయించారని మండిపడ్డారు. మాదిగ సామాజిక వర్గా లకు టికెట్లు కేటాయించకపోతే మాదిగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో అభ్యర్థిని ప్రకటించి గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో కోటగిరి పాపయ్య, న్యాతరి ప్రభాకర్, కాంపెల్లి ప్రభాకర్, పల్లె సదానందం, సంకెనపల్లి లక్ష్మయ్య, తగరం శంకర్ లాల్, బూడిద తిరుపతి, వేల్పుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి కళాశాలలో ఘనంగా ఫేర్ వెల్ డే



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 8: గాయత్రి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రథమ సంవత్సర విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సురేష్, వెంకట్‌జ్యోతి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాలలో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

వైభవంగా పోచమ్మ కొలుపు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని తుర్కలమద్దికుంటలో గురువారం గ్రామస్థులంతా పోచమ్మ కొలుపును వైభవంగా నిర్వహించారు. కొన్ని నెలల క్రితం గ్రామంలో పోచమ్మ ఆలయం నిర్మించి అమ్మవారిని ప్రతిష్ఠించారు. అలాగే ఈనెల చివరలో సమ్మక్క సారలమ్మ జాతర కొనసాగుతున్నందున ముందస్తుగా గ్రామ ప్రజలంతా పోచమ్మ ను దర్శించుకొని పూజలు నిర్వహించారు. వైస్ఎంపీపీ ముత్యాల రాజయ్య, మాజీ సర్పంచ్ తంగేళ్ల జయప్రద-సంజీవరెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లేశం, సురేష్, కిష్టయ్య, ముత్యాల రాము, వెంకటి, సంపత్‌రెడ్డి, ముత్యాల చంద్రయ్య, ముత్యాల తిరుపతి, శ్రీను, దాడి కనుకయ్య, చెల్లోజు రాజేశం, ముక్కెర లక్ష్మయ్య, గుమ్మడి రాయమల్లు, స్వామి, దాసరి తిరుపతి, నర్సయ్య, వెంకటేషం , బోయిని పోశాలు పాల్గొన్నారు.

జారతలో క్యూలైన్ నిర్మాణం కోసం పైపుల వితరణ

ఓదెల, ఫిబ్రవరి 8 : మండలంలోని కొలనూర్ గుట్టల్లో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు సౌకర్యార్థం క్యూలైన్‌ల ఏర్పాటుకు హరిపురం గ్రామానికి చెందిన అక్కపాక నర్సయ్య గురువారం పైప్‌లను వితరణ చేశారు. జాతర చైర్మన్ దేవిడి స్వామిరెడ్డికి అందజేయగా క్యూలైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామ శంకర్, కాంగ్రెస్ నాయకులు గాజుల శివశంకర్, మద్దెల గట్టు యాదవ్, జక్కుల మధు, కొండయ్య, చరణ్, రాజ్‌కుమార్, తుమ్మల మల్లయ్య, వెంకటేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారుడు రమణయ్యకు అవార్డు



అవార్డు అందుకుంటున్న రమణయ్య

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి8: జాతీయస్థాయి జానపద గాయకులు, నాట్య కళాకారుడు, గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కనకం రమణయ్యకు అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల బిట్టు బిట్టు డాన్స్ అకాడమీ, దేవా కళా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పురస్కారాల కార్యక్రమంలో రమణయ్యకు కళాగురువు అవార్డుతో సత్కరించారు. కళాకారులు అంతడుపుల నాగరాజు, ఆట మల్లేష్, సంస్థ అధ్యక్షులు పులిపాక దేవేందర్ చేతుల మీదుగా రమణయ్య అవార్డును అందుకున్నారు. రమణయ్య గత 30 ఏళ్ళుగా కళారంగంలో సేవలు అందిస్తున్నారు. రమణయ్య అవార్డు అందుకోవడం పట్ల కళాకారులు రాజమౌళి, మధురి శ్రీనివాస్, బీరుక లక్ష్మణ్, సోగాల వెంకటి, నాగుల శ్రీనివాస్, అంజలి, సిరిపురం శ్రీనివాస్, సంపత్, జాన్ సామ్యూల్, ఆర్య లక్ష్మి కళ అభినందనలు తెలిపారు.

బిరుదు రాజమల్లు కుటుంబ సభ్యులకు పరామర్శ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 8: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కతారి రేవతిరావు పరామర్శించారు. బిరుదు చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించి, బిరుదు రాజమల్లు కుమారుడు రాధాక్రిష్ణ, కోడలు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ సమత, దీప్తి, కూతురు రత్నకుమారి తదితరులను ఓదార్చారు. వారికి మనోధైర్యం అందించారు. నియోజవకర్గ ప్రజలకు బిరుదు చేసిన సేవను కొనియాడారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన దాసరి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 8: సుల్తానాబాద్ మండలం పూసాల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, సుల్తానాబాద్ లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకులు మాటేటి గట్టయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను గురువారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించారు. గట్టయ్య కుమారుడు సంజీవ్‌కుమార్ కోడలు స్వప్న తదతరులకు తన సానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 8: స్థానిక మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు. దివ్యాంగులైన చిన్నారలకు పెద్దలకు భోజన పాకెట్లు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోముల శ్రీనివాస్ రెడ్డి, పిట్టల వెంకటేశం, తమ్మనవేణి సతీష్, సాంబమూర్తి, రమేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి

ధర్మారం, ఫిబ్రవరి8: కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా బొమ్మా రెడ్డిపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ గాగిరెడ్డి తిరుపతిరెడ్డి నియమితులయ్యారు. గురువారం జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ నియామకపత్రం తిరుపతిరెడ్డికి అందజేశారు. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తానని చెప్పారు. తిరుపతిరెడ్డి నియామకంపై మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, చింతల ప్రదీప్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, కొత్త నర్సింహం, కాంపెల్లి రాజేశం, చిప్ప మణిశర్మలు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుకు సన్మానం

జ్యోతినగర్, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కార వేణుగోపాల్‌రావును గురువారం హైదరాబాద్‌లో ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఎన్టీపీసీ గుర్తింపు సంఘం నేత బాబర్ సలీంపాషా సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు దక్కాలని ఆకాంక్షించారు.

నేత్రదానం

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 8: గోదావరిఖని మేదరిబస్తీకి చెందిన పిట్టల శంకరమ్మ(64) గురువారం గుండెపోటుతో మరణించగా కుటుంబ సభ్యులు నేత్రదానికి ముందుకురాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ టెక్నిషియన్ ద్వారా సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. శంకరమ్మ కుటుంబ సభ్యులను ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు చర్యలు

- ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్ - వోల్వో డంప్‌ట్రక్ శిక్షణ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని, ఫిబ్రవరి 8: నిరుద్యోగ యవతకు ఉపాధి కల్పించడానికి సింగరేణి యాజమాన్యం చర్యలు చేపడుతుందని ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. గురువారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో వోల్వో డంప్ ట్రక్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పించడానికి సింగరేణి సీఎస్ఆర్ నిధుల ద్వారా వివిధ ఏరియాల నుంచి ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. వీరికి 18 రోజులు ఎంవీటీసీలో బేసిక్ ట్రైనింగ్ ఇచ్చి 12రోజులు ప్రాక్టికల్ శిక్షణలో భాగంగా వోల్వో డంప్ ట్రక్‌పై శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. 46రోజుల పాటు ఆన్‌ది జాబ్ ట్రైనింగ్ ప్రతి ఒక్కరూ స్వతహాగా వోల్వో డ్రైవింగ్ చేయడం జరుగుతుందని, అనంతరం రెండు రోజులు ఫీడ్ బ్యాక్ క్లాసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లేష్, రాంమోహన్, లక్ష్మీనారాయణ, రాంమూర్తి, డేనియల్, బంగారు సారంగపాణి, రాంమూర్తి, ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోషం, మేనేజర్ హరిబాబు పాల్గొన్నారు.

భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 8: భారీయంత్రాల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ అన్నారు. మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశాల్లో భాగంగా గురువారం ఓసీపీ-3 కృషిభవన్‌లో జరిగిన సమావేశంలో జీఎం మాట్లాడారు. ఉత్పత్తి, ఉత్పాదకత, వార్షిక లక్ష్యాలను, లక్ష సాధనకు అనుసరించాల్సిన ప్రణాళికలు, సంస్థ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు ఉద్యోగులకు వివరించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, పీవో మధుసూదన్, మల్టీడిపార్ట్‌మెంటల్ సభ్యులు నరసింహారావు, బచ్చ రవీందర్, రాజేంద్రప్రసాద్, మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, రమేష్, రాజాజీ, భరత్‌కుమార్‌లున్నారు.

గనిలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

రామగిరి, ఫిబ్రవరి 8: గనుల్లో చేపట్టే పనుల్లో అప్రమత్తంగా ఉండాలని జీఎం సేఫ్టీ గురువయ్య తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. నిబంధనలను అనుసరిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం ఏఎల్‌పీ గనిని సందర్శించారు. గనిలోని స్ట్రాట కంట్రోల్, లాంగ్‌వాల్ ఫేస్ మానిటరింగ్, ట్యూబ్ బెండల్ మానిటరింగ్, కార్గోకన్వేర్ సిస్టం, రెస్పాండింగ్ సిస్టంలను పరిశీలించారు. సమావేశంలో ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అధికారులు ఎలీషా, సీతారామం, రఘుపతి, వెంకటరమణ, రాధాకృష్ణ, నాగేశ్వర్‌రావు, జైనుల్లాబద్దీన్, చంద్రశేఖర్, శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం

రామగిరి, ఫిబ్రవరి 8: సింగరేణి ఏపీఏ డివిజన్ పరిధిలోని జీఎం కార్యాలయంలో గురువారం మల్టీడిపార్ట్మెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఏ ఎస్‌వోటూ జీఎం బైద్య ముఖ్యఅతిథిగా హాజరై సింగరేణి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమలతోపాటు కంపెనీ ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలు, సింగరేణి వినియోగించే యంత్రాలు పనితీరు, ఉత్పత్తి, ఉత్పాధకతపై అధికారులతో చర్చించారు. అధికారులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, రాజారెడ్డి, సత్యనారయణ, శ్యామల, మారుతీ, గుర్రం శ్రీహరి, సునీల్‌ప్రసాద్, రాజేశం, మతీన్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలి

ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జీ-3 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 8: వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. గురువారం ఓసీపీ-1 సీహెచ్‌పీలో జరిగిన మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశంలో జీఎం మాట్లాడారు. వార్షిక లక్ష్యాలను సాధించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అంకితభావం, భద్రతతో విధులు నిర్వహించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గుసరఫరా చేయడం ద్వారా సింగరేణి మార్కెట్ పెరగడం, బొగ్గుకు డిమాండ్ ఏర్పడతుందని తద్వారా సంస్థ లాభాలు గడిస్తుందన్నారు. సీహెచ్‌పీ ఉద్యోగులు సకాలంలో బొగ్గు సరఫరాచేయడం, నాణ్యత పాటించేలా దృష్టిసారించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 77మిలియన్ టన్నుల లక్ష సాధనలో ఓసీపీ-1 ఉద్యోగులు కృషి చేయాలన్నారు. ఏరియా ఇంజనీర్ ఎలీషా, ఓసీపీ-1 పీవో రాధాకృష్ణ, ఎస్ఎంఎస్ ప్లాంట్ పీవో రమేష్, మేనేజర్ ఉదయ్‌హరిజన్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు రాజయ్య, కిషన్ నాయక్ పాల్గొన్నారు.



పని స్థలాలను పరిశీలిస్తున్న డీఎంఎస్(మైనింగ్)

ఆర్జీ-3,ఏపీఏ డివిజన్లలో పర్యటించిన డీఎంఎస్(మైనింగ్)

రామగిరి, ఫిబ్రవరి 8: సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్లలో గురువారం డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(మైనింగ్) నాగేశ్వర్‌రావు పర్యటించారు. ఆర్జీ-3 డివిజన్‌లోని ఓసీపీ-1,2, హైవల్ బెంజ్, ఏపీఏ పరిధిలోని ఏఎల్‌పీ పంచ్ ఎంట్రీ లోకేషన్‌ను పరిశీలించారు. భద్రత చర్యలను పటిష్టంగా చేపట్టాలన్నారు. అనుక్షణం భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాల్సిందిగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, అధికారులు ఎలీషా, వెంకటరమణ, నాగేశ్వర్‌రావు, రఘుపతి, నాగేశ్వర్‌రావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సంస్థ వ్యవహారాల్లో రాజకీయ జోక్యం సరికాదు : ఏఐటీయూసీ



సమావేశంలో మాట్లాడుతున్న వైవీ రావు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 8: సింగరేణి వ్యవహారాల్లో రాజకీయ పార్టీల జోక్యాన్ని సహించేది లేదని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి విషయాల్లో జోక్యం చేసుకుని సంస్థను భ్రష్టు పట్టించిందని, అదే మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంస్థ సంబంధిత అంశాల్లో జోక్యం చేసుకోవడం మానుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మితిమీరిన జోక్యంతో కార్మిక సంఘాల ఉనికిని దెబ్బతీసేలా వ్యవహరించిందని, ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా అదేతరహా విధానాన్ని అనుసరించడం సరికాదన్నారు. సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించిన ఘనత ఏఐటీయూసీదని, కార్మికుల హక్కుల విషయంలో కార్మిక సంఘాలు పనిచేస్తాయని, రాజకీయ పార్టీ జోక్యం అవసరం లేదన్నారు. రాజకీయ పార్టీల నీడలో పనిచేసిన యూనియన్లు కనుమరుగయ్యాయని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవడం ఉత్తమమన్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలు సాధారణ ప్రక్రియని, రాజకీయ ప్రయోజనాలకు దాన్ని వాడుకోవడం సమంజసం కాదన్నారు. కాగా, కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఎల్ ప్రకాష్, రాజారత్నం, జిగురు రవీందర్, రాంచందర్, ఎంఆర్‌సీరెడ్డి, డీటీ రావు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎండీ సతీమణి శారదాబలరాం



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 8: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సింగరేణి సీఎండీ సతీమణి శారదాబలరాం అన్నారు. గురువారం ఆర్‌జీ-1 ఏరియా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇల్లందు క్లబ్‌లో నిర్వహించిన బొమ్మల కొలువు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన పండుగలను, సంస్కృతిని ఘనంగా నిర్వహించుకోవాలని, పిల్లలకు కూడా మన సంప్రదాయాలను, సంస్కృతిని నేర్పించాలని, చిన్ననాటి నుంచే వారికి దైవభక్తిని పెంపొందించాలని అన్నారు. ఈ బొమ్మల కొలువులో అయోధ్య రామమందిర్, బాలరాముని నిర్మాణం, సమ్మక్క-సారలమ్మ, లక్ష్మీదేవి, గణపతి బొమ్మలను ఏర్పాటు చేశారు. ఇవి ఎంతో ఆకర్షణగా నిలిచాయి. లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు చింతల లక్ష్మీశ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళ్యాణి, మాలతి, అలివేణి, విజయ, ప్రియదర్శిని, పద్మ, లలితగుప్తా, కవిత, రమ, తార, హేమలత, శ్రీవాణి, కళ్యాణి పాల్గొన్నారు.